సాక్షి
కృష్ణాజిల్లా
గురువారం । 23 । జనవరి । 2025



జీసీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ

మధురానగర్: గవర్నమెంట్ కాలేజియేట్ టీచర్స్ అసోసియేషన్(జీసీటీఏ) క్యాలెండర్‌ను బుధవారం ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏ విద్యాసాగర్ ఆవిష్కరించారు.



సెపక్‌తక్రా జట్లకు స్వాగతం

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్) అండర్–14 సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొనే జట్లు విజయవాడకు చేరుకుంటున్నాయి. 24 నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి.



ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జేఈఈ, బీటెక్ ప్రవేశాల కోసం దేశ వ్యాప్తంగా నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్ష ఉమ్మడి కృష్ణాజిల్లాలో బుధవారం ప్రశాంతంగా ప్రారంభమైంది.

ఉచితం మాటున లూటీ

జిల్లాలో ఇసుకాసురుల ఇష్టారాజ్యం

- అక్రమంగా తవ్వకాలు.. అనధికారికంగా తరలింపులు
- రూ.కోట్లు కూడబెట్టుకునే పనిలో కూటమి నాయకులు
- జిల్లా దాటుతున్న వందల ట్రాక్టర్లు, లారీల ఇసుక
- పెనమలూరు, పామర్రు, అవనిగడ్డ నియోజకవర్గాల్లో చీకటి దందా
- గనుల శాఖ మంత్రి ఇలాఖాలో మితిమీరిన ఆగడాలు
- ట్రాక్టర్ రూ.4వేలు పైనే, టిప్పర్ రూ.20 వేల వరకు అమ్మకాలు

సాక్షి, మచిలీపట్నం: ఉచిత ఇసుక ప్రజలకు అందనంత దూరంలో ఉంది. ఉచిత హామీతో ఓటర్లను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జనానికి మస్కా కొట్టింది. గత ప్రభుత్వ విధానాన్నే అమలు చేసి, రవాణా, ఇతర చార్జీల పేరుతో భారాన్ని వేసింది. టన్నుల ప్రకారం ధరలు పెట్టి విక్రయిస్తుండటంతో పాటు టీడీపీ నేతలకు ఆదాయ మార్గాన్ని చూపింది. దీంతో నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోపిడీకి పాల్పడుతున్నారు. మరోవైపు గనుల శాఖ మంత్రి సొంత జిల్లాలో రీచ్‌లు, స్టాక్ పాయింట్లు ఉన్న చోట, లేని చోట్ల నుంచి కూడా ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రీచ్‌ల వద్ద కేవలం మనుషులతోనే తవ్వకాలు జరిపి, లారీలు, ట్రాక్టర్లు లోడ్ చేయాలని నిబంధన ఉన్నప్పటికీ యంత్రాలతో తవ్వేసి లోడింగ్ చేసి, ఖనిజ సంపదను దోచేస్తున్నారు.

అక్రమాలకు హద్దు లేదు..

ఇసుక అక్రమాలకు రాత్రీపగలూ అనే తేడా లేదు. జిల్లాలో తోట్లవల్లూరులో ఐదు, ఘంటసాలలో రెండు, కంకిపాడు మండలంలో రెండు అధికారిక రీచ్‌లు ఉన్నాయి. ఇక్కడ టన్నుల చొప్పున విక్రయిస్తున్నట్లు చెబుతున్నా.. అనధికారికంగా టన్నేజీకి మించి లోడింగ్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో యంత్రాలతో తవ్వేస్తున్నారు.



ఈ చిత్రం తోట్లవల్లూరు పట్టణంలోనిది. టిప్పర్లను ఇసుకతో నింపి, తరలిస్తుండగా.. గ్రామస్తులు సోమవారం అడ్డుకుని నిలిపివేశారు. నిబంధనలకు విరుద్ధంగా రీచ్‌ల నుంచి ఇసుకను పొక్లయిన్లతో తోడేసి, అక్రమంగా, అధిక టన్నేజీతో తరలిస్తుండటంతో అడ్డుకున్నామని స్పష్టం చేశారు. వెంటనే ఎంటర్ అయిన అధికార పార్టీ నేతలు.. బెదిరించి, ఎలాంటి కేసులు లేకుండా టిప్పర్లు విడిపించినట్లు అక్కడి స్థానికులు చెప్పుకుంటున్నారు.



పెనమలూరు మండలం చోడవరం నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

జిల్లా వ్యాప్తంగా..

కృష్ణా జిల్లాలో ఇసుక అక్రమంగా రవాణా చేస్తూ.. అధికార పార్టీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నారు. రీచ్ వద్ద ఉన్న ఇసుకను ఎమ్మెల్యే అండగా అనుచరులు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

- పెనమలూరు మండలం యనమలకుదురు, పెద్దపులిపాక, చోడవరం గ్రామాల్లో రీచ్‌లు లేకపోయినా.. కృష్ణా నది నుంచి అక్రమ ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయి. ట్రాక్టర్ ఇసుక రూ.2500 నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక్కడి నుంచి రోజుకి 100 నుంచి 150 ట్రాక్టర్ల ఇసుక అమ్ముతున్నారు. వీళ్లకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, కూటమి నాయకుల అండ ఉందని స్థానికులు చెబుతున్నారు.
- కంకిపాడు మండలం మద్దూరు గ్రామం నుంచి రోజుకు 150 ట్రాక్టర్ల వరకు, 100కు పైగా లారీలు ఇసుక తరలిస్తున్నారు.
- పామర్రు నియోజకవర్గం తోట్లవల్లూరు మండలంలో రొయ్యూరు, నార్త వల్లూరులో అధికారిక రీచ్‌లు ఉన్నాయి. స్టాక్ పాయింట్లలో లారీ ఇసుకను రూ.9వేలకు అమ్ముతున్నారు.
- రొయ్యూరు రీచ్ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అనుచరులు, నార్తవల్లూరు రీచ్‌ను పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా సన్నిహిత కాంట్రాక్టర్ నిర్వహిస్తున్నారనే చర్చ సాగుతోంది. పగలు మామూలుగా స్టాక్ యార్డు నుంచి అమ్మకాలు సాగిస్తూ, రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నట్లు తెలుస్తోంది.
- అవనిగడ్డ నియోజకవర్గంలోని ఘంటశాలలో ప్రభుత్వ ఇసుక రీచ్ ఉంది. ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేయడానికి కూలీలు రూ. 500 తీసుకుంటున్నారు. టిప్పర్ లోడ్ చేయడానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.1500 తీసుకోవాల్సి ఉండగా పొక్లెయిన్‌తో లోడ్ చేయించి రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. టీడీపీ మండల పార్టీ కన్వీనర్ తుమ్మల చౌదరిబాబు, ఎంపీటీసీ తాడికొండ చిన్నా, బాపట్ల జిల్లాకు చెందిన మరో వ్యక్తి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని స్థానికులు చెప్పుకుంటున్నారు.

ప్రజా భద్రత విషయంలో రాజీ పడం

హోం మంత్రి వంగలపూడి అనిత



విజయవాడస్పోర్ట్స్: ప్రజలకు భద్రత కల్పించే విషయంలో ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజిబుల్ పోలీసింగ్, ఇన్విజిబుల్ పోలీసింగ్, ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజా భాగస్వామ్యంతో ఏర్పాటయ్యే సురక్షా కమిటీల ద్వారా నేరాలను కట్టడి చేసేందుకు పోలీస్ శాఖ సరికొత్త ప్రయత్నం చేస్తోందని వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సురక్షా కమిటీలను విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్ హాలులో హోం మంత్రి అనిత బుధవారం ప్రారంభించి మాట్లాడారు. సురక్షా కమిటీకో ఆర్డినేటర్‌గా కేవీ నరసయ్య నియమితులయ్యారు.

దాతల ప్రోత్సాహం అభినందనీయం..

డీజీపీ ద్వారకాతిరుమలరావు మాట్లాడుతూ నేరాల కట్టడికి ప్రజలు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. విజయవాడ నగరంలోని బ్లాక్‌స్పాట్‌లలో ఏర్పాటు చేసేందుకు 1,150 సీసీ కెమెరాలను వితరణగా ఇచ్చిన దాతలను ఆయన అభినందించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మాట్లాడుతూ విజయవాడ నగరంలోని పోలీస్ క్వార్టర్స్, పోలీస్ స్టేషన్‌ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. అనంతరం 1000 సీసీ కెమెరాలతో పాటు, ఈగల్ వాహనాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమా, సుజనా చౌదరి, వసంత కృష్ణప్రసాద్, తంగిరాల సౌమ్య, శ్రీరాంరాజగోపాల్‌తాతయ్య, కొలికపూడి శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు, డీసీపీలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ పురస్కారాలు



పెనమలూరు: పోరంకి విజ్ఞాన భారత్ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కార అవార్డు పొందారు. భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయ్‌పూలే పేరున ఉపాధ్యాయులకు జాతీయ పురస్కారాలు గుంటూరులో ఇటీవల అందజేశారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఎం.సుగుణవల్లి, జి.స్వరూప, జి.సువర్చల ఉపాధ్యాయ వృత్తిలో సుదీర్ఘసేవలు అందించి ప్రతిభ చూపటంతో అవార్డు పొందారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీరిని ప్రొఫెసర్ కొడాలి రామశేషాద్రిరావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల ధర్నా




పెనమలూరు: తడి, పొడి చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లకు గత మూడు నెలల జీతాలు ఇవ్వాలని కార్మికులు పోరంకిలోని తాడిగడప మునిసిపాలిటీ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కార్మికుల సంఘ రాష్ట్ర కోశాధికారి జ్యోతిబసు మాట్లాడుతూ గత మూడు నెలలుగా కార్మికులకు ప్రభుత్వం జీతాలు చెల్లించక పోవటం దారుణమన్నారు. మునిసిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య దోరణి చూపటం సరైందికాదన్నారు. మునిసిపాలిటీలో పని చేస్తున్న ఇతర కార్మికుల సమస్యలు కూడా తక్షణం పరిష్కరించాలని లేని పక్షంలో ఫిబ్రవరి నెల నుంచి సమ్మె చేస్తామని తెలిపారు. అనంతరం కార్మికులు కమిషనర్ భవానీప్రసాద్‌ను కలిసి జీతాలు చెల్లించాలని విన్నవించారు. నేతలు ఉప్పాడ త్రిమూర్తి, షేక్.కాశిం, షేక్.మస్తాన్‌వలి, వై.సరళ, మధిర ఏడుకొండలు, దుర్గారావు, వెంకటరెడ్డి, పలువురు పాల్గొన్నారు.


కూచిపూడి పీఠంకు 'న్యాక్' అభినందన



కూచిపూడి(మొవ్వ): కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర కళాపీఠం విద్యార్థులను నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్(న్యాక్) బృందం అభినందించినట్లు అదనపు బాధ్యతలతో ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్న డాక్టర్ ముసుగు శ్రీనివాసరావు వెల్లడించారు. ఐదుగురు సభ్యులతో కూడిన న్యాక్ బృందం తెలంగాణ రాష్ట్రంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం క్యాంపస్‌ను పరిశీలించింది. ఈ సందర్భంగా కూచిపూడి శ్రీసిద్ధేంద్రయోగి నాట్య కళాపీఠం డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సు చేస్తున్న విద్యార్థినులు ఉప ప్రధానాచార్యులు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ నేతృత్వంలో తరంగం నృత్యంతో పాటు పలు నృత్యాంశాలను ప్రదర్శించారని తెలిపారు. అలాగే కూచిపూడి నాట్య కళాపీఠంలో జరుగుతున్న వివిధ కోర్సుల నాట్య శిక్షణపై ఎంపీఏ విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారన్నారు. వీటిని చూసిన న్యాక్ సభ్యులు కళాపీఠాన్ని అభినందించినట్లు చెప్పారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలిగండ్ల నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు పర్యవేక్షణలో న్యాక్ బృందం మూడు రోజులపాటు కొనసాగించిన ఈ పరిశీలనలు బుధవారంతో ముగిశాయని వెల్లడించారు.

క్రీడాకారులకు సత్కారం





చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అభినందించారు. 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్‌లో అండర్ 19 బాలికల విభాగంలో తిరుమలశెట్టి నాగ చంద్రిక, అండర్–14 బాలుర విభాగంలో పుప్పాల శ్రీరామ్ గోపాల్ తమ ప్రతిభను చూపించి ఆంధ్రప్రదేశ్ టీమ్‌కు ఎంపికయ్యారు. వీరిని బుధవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలెక్టర్ సత్కరించారు.

ఓపీలో వైద్యులు లేకుంటే ఎలా?

బందరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌పై మంత్రి కొల్లు ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్

మచిలీపట్నంటౌన్: బందరులోని జిల్లా సర్వజన ఆస్పత్రిలో పని చేస్తున్న నలుగురు కీలక వైద్యులను సదరం ధ్రువీకరణ పత్రాల రీ వెరిఫికేషన్ కోసం ఇతర ప్రాంతాలకు పంపడంపై రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. నేత్ర విభాగంలో ఉన్న ఇద్దరు వైద్యులు జి. భానుమూర్తి, అమృత, చెవి, ముక్కు, గొంతు విభాగంలో ఉన్న వైద్యురాలు సి. అనితను ఇతర ప్రాంతాలకు వెళ్లాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డి. ఆశాలత సోమవారం ఆదేశించారు. దీంతో ఆయా విభాగాల్లో వైద్య సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆ రోజు నేత్ర శస్త్ర చికిత్సల కోసం వచ్చిన 20 మంది రోగులు, ఓపీల వద్దకు వచ్చిన రోగులు వైద్యం పొందకుండానే ఇంటి ముఖం పట్టారు. ఈ విషయం ఈ నెల 21వ తేదీ మంగళవారం 'సాక్షి' పత్రికలో 'జీజీహెచ్‌లో నిలిచిన వైద్య సేవలు' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. ఈ వార్తపై స్పందించిన మంత్రి కొల్లు రవీంద్ర ఆస్పత్రిలోని ఓపీలను సైతం మూసేసి ఇతర విధులకు కీలక వైద్యులను పంపిన సూపరింటెండెంట్ ఆశాలత చర్యను తప్పుపట్టినట్లు తెలిసింది. సదరం విధులను పక్కన పెట్టి గురువారం నుంచి జీజీహెచ్‌లో వైద్య సేవలకు అందుబాటులో ఉండాలని వైద్యులను మంత్రి ఆదేశించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఈ వ్యవహారం మీడియాలో రావటానికి కారణమంటూ నేత్ర వైద్య నిపుణుడు భానుమూర్తికి సూపరింటెండెంట్ ఆశాలత బుధవారం మెమో ఇచ్చినట్లు తెలిసింది.

'కొలికపూడి' చెప్పేవన్నీ అబద్ధాలే



భూక్యా చంటిని పరామర్శిస్తున్న మేరుగ నాగార్జున, అవినాష్, స్వామిదాసు, మేయర్ భాగ్యలక్ష్మి

మాజీమంత్రి మేరుగ నాగార్జున

తిరువూరు: టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే ఆడుతున్నారని, గిరిజన మహిళపై దాడిచేసి అది తప్పుకాదని బుకాయిస్తున్నారని మాజీ మంత్రి మేరుగ నాగార్జున మండిపడ్డారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు మండలం గోపాలపురంలో ఈనెల 11న ఎమ్మెల్యే దాడిలో తీవ్రంగా గాయపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వార్డు సభ్యురాలు, గిరిజన మహిళ అయిన భూక్యా చంటిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్‌తో కలిసి బుధవారం పరామర్శించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ తిరువూరులో ఎమ్మెల్యే అరాచకంగా వ్యవహరిస్తున్నారని.. కొలికపూడికి మహిళలంటే గౌరవంలేదన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఎమ్మెల్యే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రజలపై దాడులకు పాల్పడటం, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం గర్హనీయం. గిరిజన మహిళపై దాడిచేసి ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేసిన సంఘటన జరిగి 12 రోజులు గడిచినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడమేమిటి? బాధిత కుటుంబానికి మా వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది. పోలీసులు ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టుచేయాలి.

ఎమ్మెల్యేపై చర్యలెందుకు తీసుకోవట్లేదు?

ఇక ఎమ్మెల్యే కొలికపూడిపై టీడీపీ అధిష్టానం ఎందుకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవట్లేదని దేవినేని అవినాష్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేతో పాటు ఈ దాడిలో పాల్గొన్న వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నిజానికి.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రశాంతంగా ఉన్నారని, టీడీపీ పాలనలో జరుగుతున్న అరాచకాలకు అంతూపొంతు లేకుండా పోయిందని మండిపడ్డారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులే కొలికపూడిపై ఫిర్యాదు చేస్తున్నారంటే ఆయన అరాచకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తోందన్నారు. ఇక ఎమ్మెల్యే తన స్వీయ రక్షణ కోసమే గిరిజన మహిళ కుటుంబంపై అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఆరోపించారు. మహిళలకు అండగా ఉంటామని చట్టసభల్లో మాట్లాడే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు తిరువూరు ఎమ్మెల్యే చర్యలకు ఏం సమాధానం చెబుతారని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి ప్రశ్నించారు.

ఖర్చు ఘనం.. అభివృద్ధి శూన్యం

- గతంలో పరిశ్రమ అభివృద్ధి కోసం నిర్మించిన వైనం
- వాటివైపు కన్నెత్తి చూడని ప్రభుత్వం
- ప్రస్తుతం ప్రత్యేక క్లస్టర్ ఏర్పాటు అంటూ హడావుడి
- గతంలోనూ క్లస్టర్ పేరిట నిధులొచ్చినట్లు గుర్తుచేస్తున్న కార్మికులు
- అవి ఏమయ్యాయో కూడా తెలీదని ఆవేదన

నిరుపయోగంగా 'కలంకారీ' భవనాలు



శిథిలావస్థకు చేరుతున్న మాజీ ఆర్మీ జవాన్ నిర్మించిన కలంకారీ శిక్షణ కేంద్ర భవనం

పెడన: చరిత్ర కలిగిన కలంకారీపై ఎంతో మంది ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఈ పరిశ్రమ అభివృద్ధి మాత్రం ఆశించిన స్థాయిలో లేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా పెడనలో కలంకారీ క్లస్టర్ ఏర్పాటు చేస్తామంటూ హడావుడి చేస్తోంది. ఇప్పటికే కలెక్టర్ డీకే బాలాజీ పరిశ్రమలు, చేనేత జౌళి శాఖాధికారులతో పెడనలో పలు స్థలాలను క్లస్టర్ ఏర్పాటు కోసమని పరిశీలించి వెళ్లారు. అయితే గతంలో కలంకారీ అభివృద్ధి కోసమంటూ నిర్మించిన భవనాల పరిస్థితి ఏమిటనే ప్రశ్న కార్మికుల నుంచి వస్తోంది. గతంలో కూడా కలంకారీ క్లస్టర్ అంటూ నిధులు మంజూరయ్యాని, అసలు అవి ఏమయ్యాయో కూడా తమకు తెలీదని పలువురు కళాకారులు చెబుతుండటం గమనార్హం.

శిథిలావస్థలో శిక్షణ కేంద్రం..

పెడన బైపాస్ రోడ్డులోని తన సొంత స్థలంలో రిటైర్డ్ ఆర్మీ జవాను సువర్ణరాజు ఎస్సీ కార్పొరేషన్ రుణంతో కలంకారీ శిక్షణ కేంద్రాన్ని నిర్మించారు. కొన్నాళ్ల పాటు శిక్షణ తరగతులు కూడా బాగానే జరిగాయి. ఆ తరువాత ఏమైందో ఏమో ఆగిపోయింది. తరువాత కాలంలో సువర్ణరాజు మృతి చెందడం, ఆ భవనం కాస్తా శిథిలావస్థకు చేరిపోయింది. ప్రస్తుతం ఈ భవనంపై వివాదం నడుస్తున్నట్లు తెలుస్తోంది.

పక్కా భవనం.. పక్కదారి..

పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పక్కనే టూరిజం వారు పక్కా భవనాన్ని నిర్మించారు. కలంకారీకి సంబంధించి అన్ని వివరాలను తెలియజేసేలా గైడ్‌ను పెట్టి టూరిజం ద్వారా వచ్చే వారికి తెలియజేసేందుకు తగు చర్యలు తీసుకున్నారు. భవనం నిర్మించారే తప్ప ఆచరణ సాధ్యం కాలేదు. రూ.లక్షలు పెట్టి కట్టిన భవనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉంటుంది. ప్రస్తుతం అందులో సంచార జాతుల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి.



పిచ్చి మొక్కలతో మూసి ఉంచిన చేనేత జౌళిశాఖ నిర్మించిన కలంకారీ ఫెసిలిటీ సెంటర్

అడపాదడపా అలా..

చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో కలంకారీ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇది కూడా నిరుపయోగంగా ఉంటుంది. మూసి ఉంటే బాగుండదనే ఉద్దేశంతో ఏడాదిలో ఒకసారి వారికి అవకాశం ఉన్నప్పుడు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంటారు.

లక్షలు పెట్టి నిర్మించి వదిలేస్తే ఎలా?

రూ.లక్షలు పెట్టి భవనాలు నిర్మించి ఖాళీగా వదిలేయడం పట్ల కలంకారీ వర్కర్లు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ప్రజా సొమ్ము దుర్వినియోగం చేయడమేనని, ఉపయోగపడేలా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలనే డిమాండ్ వర్కర్ల నుంచి వ్యక్తమవుతోంది. ప్రస్తుతం కొత్తగా రానున్న కలంకారీ క్లస్టర్‌ను నిర్మిస్తే నిరంతరం పనిచేసేలా, వర్కర్లకు, వ్యాపారస్తులకు ఉపయోగపడేలా ఉండాలంటున్నారు.

రూ. 2కోట్లు ఏం చేశారో?

గతంలో క్లస్టర్ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.2కోట్లు నిధులు విడుదలయ్యాయని కార్మికులు చెబుతున్నారు. ఆ నిధులు విడుదలైన సందర్భంగా అప్పటి ఎంపీ కొనకళ్ల నారాయణరావును కలంకారీ వస్త్ర వ్యాపారులు ఎంతో ఘనంగా సత్కరించిన సందర్భాన్ని సైతం వారు గుర్తు చేస్తున్నారు. ఆ నిధులు ఏమయ్యాయో కూడా తెలియదని చెబుతున్నారు.

అభిప్రాయాలు సేకరించాలి..



కలంకారీ క్లస్టర్ నిర్మాణం జరిగితే సంతోషమే. అయితే ఈ క్లస్టర్‌కు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు ఏమిటనేది అందరికీ తెలియజేయాలి. ఆ క్లస్టర్ ప్రధానంగా వర్కర్లకు ఉపయోగపడేలా ఉండాలి. గతంలో నిర్మించిన భవనాలను కూడా పూర్తిగా క్లస్టర్‌కు అనుసంధానం చేసి వినియోగంలోకి తీసుకురావాలి. కలంకారీ క్లస్టర్ నిర్మాణానికి సంబంధించి రాజకీయ పార్టీలకు అతీతంగా కమిటీలను వేసి వర్కర్లకు కూడా ఆ కమిటీలో ప్రాధాన్యం కల్పించి చిన్న చిన్న కలంకారీ యూనిట్లకు కూడా మార్కెటింగ్ అవకాశం ఇవ్వాలి. క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించి చర్చా వేదికలు, అభిప్రాయాలు సేకరించి, సభలు పెట్టి తెలియజేస్తే మంచి ఫలితాలుంటాయి.

– కట్టా హేమసుందరరావు, చేనేత కార్మిక సంఘ నాయకుడు, పెడన

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు బాధ్యుల నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాలకు బాధ్యులను నియమించారు. ఎన్టీఆర్ జిల్లా, నందిగామ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మూలే నాగిరెడ్డి పార్టీ రాష్ట్ర గ్రీవెన్స్ విభాగ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు.

- విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన గేర హనోక్‌ను రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ విభాగ ఉపాధ్యక్షుడిగా నియమించారు.
- కృష్ణా జిల్లా, అవనిగడ్డ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన దోవారి పూర్ణ సాగర్‌ను పార్టీ రాష్ట్ర బూత్ కమిటీ విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమించారు.
- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన పి. జాకబ్ సుధాకర్ ఎన్టీఆర్ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమితులయ్యారు.



పంటల బీమా.. రైతులకు ఇవ్వని ధీమా

- పంటల బీమా పథకంపై ఆసక్తి చూపని రైతులు
- కృష్ణా జిల్లాలో సుమారు 3.4 లక్షల ఎకరాల్లో పంటల సాగు
- వివిధ పంటలు సాగుచేస్తున్న నాలుగు లక్షల మంది రైతులు
- ఇప్పటి వరకు బీమా ప్రీమియం చెల్లించింది కేవలం 3,138 మంది
- ఈ నెల 16వ తేదీతో ముగిసిన ప్రీమియం చెల్లింపు గడువు


సాగవుతున్న వరిపంట (ఫైల్)

గుడివాడరూరల్: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పంటల బీమా పథకంపై రైతులు ఆసక్తి చూపడంలేదు. ప్రీమియం మొత్తాన్ని రైతులే చెల్లించాలని ప్రభుత్వం పేర్కొనడం, ఇటీవల సంభవించిన ప్రకృతి విపత్తులకు నష్టపోయిన రైతులకు పరిహారం అందకపోవడంతో రైతులు పంటల బీమా పథకాన్ని పట్టించుకోవడంలేదు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను కూటమి పెద్దలు తుంగలో తొక్కారు. 2014 ఎన్నికల సమయంలో రైతులకు రుణమాఫీ చేసామని ఇచ్చిన హామీపై అధికారంలోకి వచ్చాక మాటమార్చారు. సవాలక్ష ఆక్షలతో రైతులను వంచించారు. గత ఐదేళ్ల రైతులకు సంబంధించి పంట బీమా ప్రీమియం మొత్తాన్ని అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే చెల్లించింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాలంటూ తొలి వెన్నుపోటు పొడిచింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనూ బీమా ప్రీమియం చెల్లించినప్పటికీ నష్టం జరిగినా పరిహారం దక్కని పరిస్థితులను గుర్తు చేసుకున్న రైతులు ఈ దఫా ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రాలేదు. ఒక పక్క పెట్టుబడి సాయం అందక, మరో పక్క ధాన్యానికి సరైన మద్దతు ధర లేక రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పులిపై పుట్రలా పంటల బీమా పథకం ప్రీమియం మొత్తాన్ని రైతులే చెల్లించాలంటూ కూటమి ప్రభుత్వం నిబంధన విధించింది.

4 లక్షల మందిలో చెల్లించింది 3,138 మంది రైతులే..

జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మంది రైతులు 3.4 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తున్నారు. పంటల బీమా ప్రీయం చెల్లింపు గడువును ప్రభుత్వం అనేక దఫాలుగా పొడిగించినా రైతులు మాత్రం ఆసక్తి చూపడంలేదు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వమే రైతుల తరపున ప్రీమియం చెల్లించి పంట నష్టం జరిగితే పరిహారం అందజేసింది. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ప్రీమియం చెల్లించినా విపత్తుల సమయంలో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదు. ఈ నేపథ్యంలో పంట నష్ట పరిహారం విషయంలో న్యాయం జరగదనే ఉద్దేశంతో బీమా ప్రీమియం చెల్లించడానికి రైతులు ముందుకు రావడంలేదు. ఇప్పటి వరకు కేవలం 3,138 మంది రైతులు మాత్రమే ప్రీమియం చెల్లించడం గమనార్హం.

గతంలో అందరికీ..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొదటి సంవత్సరం ఒక రూపాయి చెల్లించి బీమాలో పేర్లు నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆ తర్వాత నుంచి రైతుల తరపున ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించి ఉచిత పంటల బీమా అమలు చేసింది. రైతు పొలం యూనిట్‌గా తీసుకుని పరిహారం అందించింది. ప్రభుత్వం ఇచ్చిన సహకారంతో రైతులకు సాగులో ధీమా ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా పోయిందని జిల్లా రైతులు వాపోతున్నారు.

బీమాపై అవగాహన కల్పించాం

పంటల బీమాకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రీమియం నగదు చెల్లించాలి. బీమాపై జిల్లావ్యాప్తంగా ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించాం. కొందరు రైతులు బీమా చెల్లించేందుకు ముందుకు వచ్చారు. మరికొంత మంది గడువు పొడిగించినా ముందుకు రాలేదు. స్పందన మిశ్రమంగా ఉంది.

– పద్మావతి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

పంట నష్ట పరిహారానికి కొత్త మెలికలు

రైతులకు పంటలకు సంబంధించి బీమాలో నగదు నమోదు చేసుకున్నా ఒక్కో పంటకు ఒక్కో రకంగా నిబంధనలు పెట్టడంతో రైతులు కూడా ముందుకు రావడం లేదు. వరికి గ్రామ యూనిట్, మినుము, శనగ పంటలకు మండలం యూనిట్‌గా, పెసర, వేరుశనగ పంటలకు జిల్లా యూనిట్‌గా తీసుకోవడంతో పాటు గత ఐదేళ్ల కాలంలో ఏ ప్రాంతంలో ఎక్కువగా, ఎంత మేర నష్టం వచ్చిందో దానికి అనుగుణంగా బీమా ఇస్తామని ప్రభుత్వం మెలిక పెట్టింది. దీంతో రైతులు కూడా ఈ బీమా ప్రీమియం నగదు చెల్లించినా, నష్టం వాటిల్లినా ఇచ్చేది ఉండదనే నిర్ధారణతో ముందుకు రాలేదని పలువురు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

జిల్లాలో గీత కార్మికులకు 12 వైన్ షాపుల మంజూరు

సాక్షి ఎఫెక్ట్

గుడ్లవల్లేరు: ఎట్టకేలకు కృష్ణా జిల్లాలోని కల్లు గీత కార్మికులకు 12 వైన్ షాపులను ప్రభుత్వం మంజూరు చేసినట్లుగా జిల్లా ఎక్సైజ్ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలో 4,029 మంది గీత కార్మికులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం వారికి వైన్ షాపులను కేటాయించలేదు. ఈ వివరాలను వెల్లడిస్తూ ఈ నెల తొమ్మిదో తేదీన 'గీతన్నకు చంద్రన్న టోపీ' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించిన ప్రభుత్వం కల్లు గీత కార్మికులకు 12 వైన్ షాపులను మంజూరు చేసింది.

కృష్ణా యూనివర్సిటీ మహిళా క్రికెట్ జట్టు ఎంపిక



మైలవరం: దక్షిణ భారత క్రికెట్ పోటీలకు కృష్ణా యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేశామని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రిన్సిపాల్ రవి మాట్లాడుతూ.. తమ కళాశాలలో నిర్వహించిన కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళ క్రికెట్ సెలక్షన్స్‌లో వివిధ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారిణులను వర్సిటీ జట్టుకు ఎంపిక చేశామన్నారు. డాక్టర్ ఎల్‌హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి వర్ధిని, నలంద డిగ్రీ కళాశాల నుంచి లేఖన, మాధవి, శ్రీలక్ష్మి, గౌతమి, సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి ఎస్తేరు రాణి, సిద్ధార్థ మహిళా కళాశాల నుంచి చంద్రజ, లేఖన, సిద్ధార్థ ఫార్మసీ కళాశాల నుంచి సమీర, శివలక్ష్మి, వెన్నెల, మహాలక్ష్మి, ఎల్‌హెచ్ ప్రభుత్వ కళాశాల నుంచి లోహిత, కేబీఎన్ కళాశాల నుంచి సత్య జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. ఈ నెల 23 నుంచి కర్ణాటకలోని యూనివర్సిటీ ఆఫ్ మైసూర్‌లో జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఈ జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. ఈ జట్టుకు మేనేజర్‌గా తమ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి, టీమ్ క్యాప్టెన్‌గా కె.వై.ఎం.వి.వర్ధిని వ్యవహరిస్తారని ప్రిన్సిపాల్ రవి పేర్కొన్నారు.

27 నుంచి ఆహ్వాన నాటకోత్సవాలు



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఆంధ్ర నాటక కళాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ నుంచి మూడు రోజులపాటు ఎనిమిదో ఆహ్వాన నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తపస్వి కల్చరల్ ఆర్ట్స్ సంస్థ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. 27వ తేదీ సాయంత్రం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నాటకోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. తొలి రోజు గురి తప్పిన వేట, మూల్యం నాటకాల ప్రదర్శన, అంతర్జాతీయ గాయకుడు అరుణా సుబ్బారావుకు సత్కార కార్యక్రమం, 28వ తేదీ మహాప్రస్థానం, ఓ కాశీవాసా రావయ్య నాటకాల ప్రదర్శన, డాక్టర్ పాట్లూరి సుబ్రహ్మణ్యంకు ఆత్మీయ సత్కారం, 29వ తేదీన ఇది అతకని సంతకం, పేగు రాసిన శాసనం నాటకాల ప్రదర్శన, నృత్య కళాకారుడు కొమరిపాటి ఏసువెంకట ప్రసాద్‌కు ఆత్మీయ సత్కారం జరుగుతాయని వివరించారు. తపస్వి కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్మోహనరావు మాట్లాడుతూ సినీ దిగ్గజం ఎన్టీ రామారావును స్మరించుకుంటూ ఎనిమిదేళ్లుగా నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తపస్వి కల్చరల్ ఆర్ట్స్ బాధ్యులు శ్రీనివాసరావు, మల్లేశ్వర పట్నాయక్, ప్రభాకరరావు పాల్గొన్నారు. నాటకోత్సవాల బ్రోచర్లను గుప్తాతోపాటు అతిథులు ఆవిష్కరించారు.

రికవరీ నిధులు చెల్లించకుంటే కేసులు


సామాజిక తనిఖీ ప్రజావేదికలో రికార్డులను పరిశీలిస్తున్న పీడీ రాము

వత్సవాయి: ఉపాధి హామీ పథకం పనులపై జరిగిన సోషల్ ఆడిట్‌లో తేలిన అవకతవకలకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు రికవరీ నిధులు చెల్లించకపోతే కేసులు నమోదు చేస్తామని డ్వామా పీడీ ఎ.రాము హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రెండో రోజు కూడా సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. ఈ సందర్భంగా డ్వామా పీడీ రాము మాట్లాడుతూ.. మండలంలోని 28 గ్రామాల్లో 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మే 31వ తేదీ వరకు మండలంలో రూ.16 కోట్ల మేర ఉపాధి పనులు జరిగాయని తెలిపారు. ఈ పనుల్లో సుమారు రూ.20 లక్షల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించామన్నారు. వాటిని సదరు ఫీల్డ్‌అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయాలని ఆదేశించామని పేర్కొన్నారు. చిన్నమోదుగపల్లిలో గ్రామానికి చెందిన యువకుడు ఉన్నత విద్య కోసం వేరేప్రాంతానికి వెళ్లగా అతను కూడా ఉపాధి పనికి వచ్చినట్లు మస్టర్ వేయడాన్ని గుర్తించామన్నారు. మంగొల్లు, భీమవరం, చిట్టేల, దేచుపాలెం, శింగవరం గ్రామాల్లో తప్పుడు మస్టర్లు వేశారని, కాకరవాయిలో రూ.2,96,709, దేచుపాలెంలో రూ.1,41,800 పనులపై విజిలెన్స్ ఎంక్వయిరీ వేసినట్లు తెలిపారు. 17 గ్రామాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ.70,500 జరిమానా విధించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ పార్థసారథి, ఎంపీడీఓ ఎస్.రాంబాబు, ఏపీఓ రాఘవులు, టీఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలువల మరమ్మతులకు అంచనాలు రూపొందించండి

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): రాబోయే ఖరీఫ్ సీజన్‌కు కృష్ణా జిల్లాలోని పంట కాలువలు, ఇరిగేషన్ డ్రెయిన్ల మరమ్మతులకు అంచనాలు రూపొందించాలని కలెక్టర్ డి.కె.బాలాజీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌కు కాలువ నిర్వహణ పనులు ముందుగా చేపట్టేందుకు అవసరమైన అంచనాలు రూపొందించాలని సూచించారు. వేసవిలోనే ఈ పనులు పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. కాలువలు, డ్రెయిన్లలో గుర్రపుడెక్క తొలగింపు, నిర్వహణ పనులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించి ఫిబ్రవరి మూడో తేదీలోగా ఉన్నతాధికారులకు పంపాలన్నారు. తద్వారా ఏప్రిల్‌లో పనులు చేపట్టేందుకు మంజూరు తీసుకుని మేలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గుర్రపుడెక్క, తూడు ఒకే చోట వేసి కంపోస్టుగా తయారు చేసి, దీనిని రైతులు పొలాల్లో వినియోగించుకునేలా చూస్తే రైతులకు ఎరువుల వ్యయం తగ్గి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈ విధంగా చేస్తే రాష్ట్రంలోని మొట్టమొదటి జిల్లాగా కృష్ణాజిల్లా నిలుస్తుందన్నారు. కాలువల ద్వారా శివారు ప్రాంతాలు, లాకుల వద్ద చేరే గుర్రపుడెక్క, తూడు తొలగించి ఒకే చోట వేసి కంపోస్టుగా తయారుచేసేందుకు దానిని కట్టింగ్ చేయాల్సిన అవసరం ఉందని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వాటర్ యూజర్స్ సంఘాల పరిధిలో తొలగించిన తూడు ఒకే చోట వేసి కట్టింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ అధికారి మోహనరావు, డ్రెయినేజీ ఈఈ గోపీనాథ్, ఇరిగేషన్ కేఈ డివిజన్ ఈఈ కె.బాలు, కేసీ డివిజన్ ఈఈ రవికిరణ్ పాల్గొన్నారు.

దుర్గగుడి ప్రధాన అర్చకుడు బద్రీనాథ్‌బాబు ఆకస్మిక మృతి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ప్రధాన అర్చకుడు లింగంభొట్ల వెంకట సుబ్రహ్మణ్య బద్రీనాథ్ బాబు(64) మృతి చెందారు. బుధవారం ఉదయం స్నానం చేసి బాత్‌రూమ్ నుంచి బయటకు వస్తూ ఒక్క సారిగా కుప్పకూలి ప్రాణం విడిచారు. బద్రీనాథ్‌బాబుకు భార్య లక్ష్మీకుమారి, కుమారులు భవాని, శరణ్, కుమార్తె సునీత ఉన్నారు. వంశపారంపర్య అర్చకుడిగా 40 ఏళ్ల నుంచి అమ్మవారి సేవలో తరిస్తున్న బద్రీనాథ్‌బాబు దసరా ఉత్సవాల్లో అమ్మవారికి విశేష అలంకారాలు చేయడంలో దిట్ట. గడిచిన 20 ఏళ్లకు పైగా అమ్మను దసరా ఉత్సవాల్లో విశేషంగా అలంకరిస్తున్నారు. విద్యాధరపురంలోని అరవింద్ వీధిలో ఉన్న స్వగృహం వద్ద బద్రీనాథ్‌బాబు మృతదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. దుర్గగుడి పూర్వ ఈఓ కె.ఎస్.రామరావు, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, ఆలయ అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు బద్రీనాథ్‌బాబు మృతదేహానికి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవదాయ శాఖ ముఖ్య అధికారులు ఫోన్‌లో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు పొందుగల సర్పంచ్ కోటమ్మకు ఆహ్వానం


గుగులోతు కోటమ్మ

మైలవరం: మండలంలోని పొందుగల గ్రామ పంచాయతీకి అరుదైన గౌరవం దక్కింది. ఈ నెల 26న ఢిల్లీలో జరిగే 76వ గణతంత్ర వేడుకలకు అతిథిగా హాజరుకావాలని గ్రామ సర్పంచ్ గుగులోతు కోటమ్మకు కేంద్ర ప్రభుత్వం నుంచి బుధవారం ప్రత్యేక ఆహ్వానం అందింది. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేయడంతో పాటు వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించిన దేశంలోని 1000 పంచాయతీలను కేంద్రం గుర్తించింది. ఈ వెయ్యి పంచాయతీల్లో పొందుగల ఒకటి కావడం ఈ ప్రాంతానికే గర్వకారణం. ఈ నేపథ్యంలో గణతంత్ర వేడుకలకు హాజరుకావాలని సర్పంచ్‌కు ఆహ్వానం అందిందని పంచాయతీ కార్యదర్శి మహ్మద్ రఫీ తెలిపారు. గ్రామంలోని ఆరువేల మంది జనాభాలో 1200 మంది గిరిజనులు ఉన్నారు. కోటమ్మ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత అంతర్గత రహదారులు, డ్రెయిన్లు, డొంక రోడ్లు, కాలువలు, చెరువు కట్టలు బలోపేతం, శ్మశానవాటికలు, విద్యుత్ వ్యవస్థ, వీధిదీపాలు తదితర విభాగాల్లో అభివృద్ధి జరిగింది. టాటా ట్రస్టు సౌజన్యంతో ఐటీటీ సిస్టమ్‌ను రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటు చేశారు. జల్‌జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి రక్షిత తాగునీటిని అందిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల ద్వారా వర్మీ కంపోస్టు ఎరువును తయారు చేసి పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చుతున్నారు. రక్షిత మంచినీటి సరఫరాలో ఉత్తమ పంచాయతీ అవార్డును సొంతం చేసుకుంది. పొందుగల పంచాయతీ అభివృద్ధిలో సర్పంచ్ కోటమ్మ కృషి అభినందనీయమని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

అదృశ్యమైన వృద్ధురాలి మృతి

పెనమలూరు: నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన వృద్ధురాలు అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఎస్ఐ రాజేష్ కథనం మేరకు.. పెనమలూరు పల్లిపేట రామాలయం ప్రాంతానికి చెందిన పామర్తి విజయలక్ష్మి ఇంటి నుంచి అదృశ్యమయింది. ఆమె కుమారుడు సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఆమె ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. విజయవాడ – గుణదల రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం విజయలక్ష్మి తీవ్రగాయాలతో అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని జీఆర్పీ పోలీసులు గుర్తించి విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయలక్ష్మి మంగళవారం మృతి చెందింది. కదులుతున్న రైల్లో నుంచి కింద పడిపోయి గాయపడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు

పెనమలూరు: మండలంలోని పోరంకిలో విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పోరంకికి చెందిన 21ఏళ్ల విద్యార్థిని బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. సోమవారం కాలేజీకివెళ్లిన ఆమెతిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసును పోలీసులు నమోదు చేశారు.

చెరువులో మృతదేహం లభ్యం

ఉయ్యూరు: పట్టణంలోని శ్మశానవాటిక సమీపంలోని చెరువులో బుధవారం మృతదేహం లభ్యమైంది. పట్టణ పోలీసుల కథనం మేరకు.. చెరువులో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి మృతుడు పమిడిముక్కల మండలం తాడంకి గ్రామానికి చెందిన చలపాటి ప్రకాష్‌బాబు (45)గా గుర్తించారు. చిత్తు కాగితాలు ఏరుతూ, రిక్షా కార్మికుడిగా జీవనం సాగిస్తున్నట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విశ్వనాథ్ తెలిపారు.

గంజాయి తరలింపు కేసులో నిందితులకు జైలు

గుడివాడరూరల్: గంజాయి తరలిస్తూ పట్టుబడిన నిందితులకు మచిలీపట్నం ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ చిన్నంశెట్టి రాజు మూడేళ్ల జైలు శిక్ష విధించారని గుడివాడ తాలూకా ఎస్ఐ ఎన్.చంటిబాబు బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. 2012 ఏప్రిల్ ఒకటో తేదీన గుడివాడ మండలంలోని మోటూరు అడ్డరోడ్డు వద్ద కొందరు గంజాయి తరలిస్తున్నారని అప్పటి డీఎస్పీకి సమాచారం అందింది. అప్పటి ఎస్ఐ వై.వి.వి.సత్యనారాయణ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించి గంజాయి తరలిస్తున్న ముసునూరి వెంకన్నకోటిబాబు, ఏపూరి నరేష్, కిలారి సోమవెంకట దుర్గగణేష్ కుమార్, ముసునూరి మురళీకృష్ణ, ముసునూరి కాశీ విశ్వనాథం, దారపురెడ్డి రామకృష్ణను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. స్పీడ్ ట్రైల్ కేసు అవ్వడంతో పోలీసుల సమక్షంలో సాక్షులను మచిలీపట్నం ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి విచారణ జరిపారు. నిందితులపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు జైలు శిక్ష పొడిగించాల్సిందిగా తీర్పులో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కాగిత క్షమాపణ చెప్పాలి

జనసేన నాయకుడు పంచకర్ల సురేష్

పెడన: ఎన్నికల్లో తమ వల్ల అత్యధిక మెజార్టీ సాధించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తమ శ్రేణులతో వ్యవహరిస్తున్న తీరు దారుణమని, అందుకు తమ పార్టీ గూడూరు మండలం కార్యదర్శి శీరం సంతోష్ ఆత్మహత్యాయత్నమే నిదర్శనమని జనసేన పార్టీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త, ఉరివి సర్పంచ్ పంచకర్ల సురేష్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక తోటమూల పెడన ఫంక్షన్ హాలు వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ కార్యక్రమాల గురించి ఎందుకు చెప్ప దంలేదని ప్రశ్నించిన తమ పార్టీ మండలం కార్యదర్శి సంతోష్‌ను, అతని కుటుంబాన్ని గూడూరు మండల టీడీపీ అధ్యక్షుడు దూషించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తమ పార్టీ పెద్దలు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ ఘటనను ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన స్పందించలేదని ఆరోపించారు. రెండు రోజులు క్రితం గూడూరు మండలంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ కారును సంతోష్ అడ్డగించి తన ఆవేదనను వినిపించారని, ఆయన స్పందించకుండా పర్యటనను యథావిధిగా కొనసాగించారని పేర్కొన్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన సంతోష్ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని వివరించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ 24 గంటల్లోగా స్పందించి ఆస్పత్రికి వెళ్లి సంతోష్‌ను పరామర్శించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే స్పందించకపోతే జనసేన పార్టీ నిరసనలకు దిగాల్సి ఉంటుందని హెచ్చరించారు.

సాగు ఖర్చులకు అనుగుణంగా రుణపరిమితి

డీఎల్‌టీసీ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో వివిధ పంటల సాగుకు అయ్యే ఖర్చులకు అనుగుణంగా రైతులకు పంట రుణాల మంజూరుకు పటిష్ట ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ – ఎన్టీఆర్ జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ (డీఎల్‌టీసీ) సమావేశం బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్ లక్ష్మీశ వర్చువల్‌గా హాజరయ్యారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, ప్రగతిశీల రైతులు, బ్యాంకర్లు తదితరులు హాజరై 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పంటలకు రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)పై ప్రతిపాదనల రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని జిల్లాస్థాయి సాంకేతిక కమిటీ ద్వారా 2025–26కు గాను వరికి రుణ పరిమితి రూ.46 వేలు, మిరప (డ్రై)కు రూ.1,10 లక్షలు, మిరప (ఇరిగేటెడ్)కు రూ.1.15 లక్షలు, మామిడికి రూ.42,500, ఆయిల్‌పామ్‌కు రూ.75 వేలు, పట్టు పురుగుల పెంపకానికి రూ.60 వేలుగా రుణపరిమితిని ప్రతిపాదించారని వివరించారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ (రుణ పరిమితి)కి అదనంగా 30 శాతం వరకు బ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకు అవకాశముందన్నారు. ఈ సమావేశంలో కేడీసీసీబీ లిమిటెడ్ సీఈఓ ఎ.శ్యామ్ మనోహర్, జీఎం ఎ.రంగబాబు, అసిస్టెంట్ ఎల్‌డీఎం ఎం.రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి బి.విజయకుమారి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, ప్రగతిశీల రైతులు కె.నరసింహారావు, పి.నాగేశ్వరరావు, ఎ.అజయ్ కుమార్, పి.ఎస్.ఆర్.ప్రసాద్, ఎం.రాజశేఖర్, ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐఓబీ, యూకో తదితర బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన మహిళపై దాడి శోచనీయం

రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్



తిరువూరు: ఎ.కొండూరు మండలం గోపాలపురంలో గిరిజన మహిళ భూక్యా చంటిపై ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు దాడి చేసిన ఘటనపై అధికారులతో సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ తెలిపారు. గోపాలపురంలో భూక్యా చంటి కుటుంబాన్ని ఆయన బుధవారం పరామర్శించారు. గిరిజన మహిళపై దాడి శోచనీయమన్నారు. తమపై ఎమ్మెల్యే దాడిచేసి గాయపరచడమే కాక, ఆ ఘటనను వీడియో తీస్తున్న తమ కుమారుడిపై కూడా దౌర్జన్యం చేసి సెల్‌ఫోన్ లాక్కున్నారని చంటి కుటుంబ సభ్యులు వాపోయారు. బాధితురాలు తెలిపిన వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని నాయక్ తెలిపారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.